# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, శుక్రవారం 30 మే 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన మరో మంత్రి సురేఖ

# రైతులను దోచుకుంటున్నరు..

- కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెడ్తలేరు
- ట్రక్ షీట్లు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తున్నరు
- కాంటా అయిన వడ్లను మిల్లర్లు దించుకోవడం లేదు
- ఏ ఊరికి వెళ్లినా రైతులు సర్కారును తిడుతున్నరు
- అధికారులు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లు ఇవ్వలేదు
- ఉమ్మడి జిల్లా సమీక్షలో అధికార పార్టీ ఎమ్మెల్యేల అసహనం
- కలెక్టర్ల పనితీరుపై ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి ఆగ్రహం
- 6లోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశం

హనుమకొండ, మే 28: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వడ్ల కొనుగోళ్లు సరిగా జరగడం లేదంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు. క్రయ, విక్రయాలు ఆలస్యమవుతుండడంతో రైతుల్లో రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్నదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మరో మంత్రి కొండా సురేఖతో కలిసి ఆరు జిల్లాల్లోని వడ్ల కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, వానకాలం సాగు, రాష్ట్ర అవతరణ దినోత్సవంపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, యశస్వినీరెడ్డి తదితరులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు దోపిడీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కొనుగోలు కేంద్రాల్లో త్వరగా కాంటాలు పెట్టడం లేదు.. కాంటా అయిన వడ్లకు కేంద్రం నిర్వాహకులు ట్రక్ షీట్లు ఇవ్వడంలేదు. మిల్లర్లు రెండు మూడు రోజుల వరకు లారీల నుంచి లోడు దించుకోవడంలేదు. వానలతో తడిస్తే రైతులదే బాధ్యత అంటున్నరు. తేమ, తాలు ఉన్నదంటూ తూకంలో కోత పెడుతున్నరు. జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పుడు ఏ ఊరికి పోయినా రైతులు సర్కారును బూతులు తిడుతున్నరు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వడ్ల కొనుగోలుపై సమీక్షించినప్పటికీ ఎలాంటి మార్పు లేదు. మిల్లర్లు ఇష్టం వచ్చినట్లుగా దోచుకుంటున్నారు' అంటూ చెప్పుకొచ్చారు. కొనుగోలు కేంద్రంలో ట్రక్‌షీట్ ఇవ్వడం లేదని, లక్ష్మీనర్సింహా రైస్‌మిల్లులో 8రోజులుగా ధాన్యం దింపుకోలేదని, బుధవారం దింపుకొన్నారని, అదికూడా సన్నవడ్లను దొడ్డు వడ్లుగా ఇచ్చి బోనస్ పడకుండా చేశారని, తొమ్మిది రైస్ మిల్లుల యాజమాన్యాలు అవకతవకలకు పాల్పడుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంత్రికి సూచించారు. ఇంకా మిగిలిన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి కోరారు. ఇతర జిల్లాల నుంచి తన నియోజకవర్గంలోని మిల్లులకు ధాన్యం వస్తుందని, దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ట్రక్‌షీట్ సమస్య తన నియోజకవర్గంలోనూ ఉందని, రసీదులు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. తన నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు లేవని, వారి అర్హతలను పరిశీలించి సర్టిఫికెట్లు అందజేయాలని మంత్రికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని, సాదా బైనామా అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకొచ్చారు. కాగా, ఎమ్మెల్యేలు సమస్యలు చెప్పుకుంటూ పోతుండడంతో మంత్రి పొంగులేటి జోక్యం చేసుకుని పలుసార్లు వారించారు. తర్వాత మాట్లాడుదామని సముదాయించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరు బాగా లేదని, ఇప్పటికీ ఒక్క ఇల్లు నిర్మాణానికి ప్రొసీడింగ్ ఇవ్వలేదని ఎమ్మెల్యే సత్యనారాయణరావు చెప్పారు.

### ఒక్క ప్రొసీడింగ్ ఇవ్వరా?

అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకపోవడం బాధాకరమని, తాను సంతకాలు చేసినా ప్రొసీడింగ్స్ పంపిణీ చేయకపోవడం ఏమిటని మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు పనితీరు మార్చుకోవాలని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విషయంలో కలెక్టర్లు, పోలీసు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేసి ఉక్కుపాదం మోపాలని, పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక, ప్రొసీడింగ్స్ అందజేతపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైరయ్యారు. తాను లిస్ట్‌పై సంతకాలు చేసి ఇచ్చింది కలెక్టరేట్‌లో ఫ్రేమ్ కట్టించుకొమ్మని కాదని.. ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కలెక్టర్లు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. జూన్ 6లోపు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో వయో పరిమితి లేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్లు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ధాన్యం కొనుగోలు విషయంలో చెప్పిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రూ నాయక్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేటర్ మానస, హనుమకొండ, వరంగల్ జనగామ, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి కలెక్టర్లు పీ ప్రావీణ్య, సత్యశారద, రిజ్వాన్ బాషా షేక్, టీఎస్ దివాకర, అద్వైత్‌కుమార్‌సింగ్, రాహుల్ శర్మ, ఎస్పీలు, బల్దియా కమిషనర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు నాగరాజు, గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి



పెద్దముప్పారంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

# తడిసిన ధాన్యం.. కన్నీటి పర్యంతం



కుమ్మరికుంట్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం బస్తాలు

- ఆరబెట్టలేక రైతుల అవస్థలు
- మొలకెత్తిన వడ్లను కటింగ్ చేయకుండా మిల్లులకు తరలించాలని వేడుకోలు

దంతాలపల్లి, మే 29 : బోనస్, మద్దతు ధరకు ఆశపడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెస్తే తడిసి ముద్దయి మొలకెత్తడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. తేమ శాతం వచ్చిన వడ్లు తడవడంతో ఆరబెట్టలేక అవస్థలు పడుతున్నారు. వరి కోతలు జరిగి నెలన్నర దాటినా మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో ప్రభుత్వం సకాలంలో ధాన్యం కాంటాలు పెట్టకపోవడంతో వర్షాలకు తడిసి మొలకెత్తడంలో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. కాంటాలు పెట్టిన బస్తాలు మిల్లులకు తరలించకుండా కొనుగోలు నిర్వాహకులు, అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు. కుమ్మరికుంట్ల కొనుగోలు కేంద్రంలో రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం మిల్లులకు తీసుకవెళ్తే కటింగ్ పేరుతో 4 నుంచి 10 కేజీలు కటింగ్ చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లులకు తరలించి కటింగ్ చేయకుండా దిగుమతి చేసుకోవాలని వేడుకుంటున్నారు.

***కాంటా పెట్టకపోతే చావే శరణ్యం..***

వెంటనే ధాన్యం కాంటాలు పెట్టి బస్తాలను మిల్లులకు తరలించకపోతే తమకు చావే శరణ్యమని రైతులు కన్నెర్ర చేశారు. గురువారం పెద్దముప్పారం గ్రామంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. కష్టపడి పండించిన ధాన్యం నీళ్లపాలు చేస్తరా.. అని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రంలో పోసి 50 రోజులవుతున్నప్పటికీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ధాన్యం తడిసి రంగు మారి మొలకెత్తిందన్నారు. కలెక్టర్ స్పందించి కాంటాలు పెట్టి బస్తాలను మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## మిల్లులకు ధాన్యం తరలింపు

నర్సింహులపేట, మే 29: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో రైతుల ఇబ్బందులు, వడ్లు కాంటా పెట్టాలని బుధవారం తహసీల్దార్ రమేశ్‌బాబు కాళ్లు మొక్కడం.. తమ బాధలను చెప్పుకొని వేడుకోవడంతో గురువారం అధికారులు స్పందించారు. కొనుగోలు కేంద్రంలో కాంటాలు పెట్టిన ఆరు వేల బస్తాల్లో 4వేల బస్తాలను నాలుగు లారీలు, ఒక డీసీఎంలో మిల్లుకు తరలించారు. అదే విధంగా వెయ్యి బస్తాలు కాంటాలు పెట్టినట్లు అధికారులు చెప్పారు. మిగిలిన సుమారు 3 వేల బస్తాలు కాంటాలు పెట్టాల్సి ఉందని, కాంటా పెట్టిన 2 వేల బస్తాలను శనివారం వరకు పూర్తిస్థాయిలో మిల్లులకు తరలిస్తామని పేర్కొన్నారు.



కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు



కొత్తపేట కొనుగోలు కేంద్రంలో వర్షంలో వరి పంటకు టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

# తేమ రాదు.. ధాన్యం కొనరు

- రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు
- అరిగోస పడుతున్న అన్నదాతలు

బయ్యారం మే 29 : వాతావరణం చల్లబడడంతో ధాన్యంలో తేమశాతం రాక కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి రైతులు పడిగాపులు పడుతున్నారు. మండలంలోని కొత్తపేటలో పెద్ద చెరువు ఆయకట్టు కింద వరి సాగు చేసిన రైతులు పంట చేతికి రావడంతో కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. వర్షం పడగానే ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పడం.. తెరపివ్వగానే ఆరబెట్టటం నిత్యకృత్యంగా మారింది. రైతులు ప్రతిరోజూ ధాన్యాన్ని ఆరబెట్టలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అయితే నిర్వాహకులు నిబంధనల ప్రకారం 15 నుంచి 17 శాతం మాయిశ్చర్ వస్తేనే కాంటాలు వేస్తామని చెప్పడంతో వర్షం వస్తే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని వెంటనే కాంటాలు అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

### ఆరబెట్టలేక అరిగోస పడుతున్నం..



ప్రతి రోజూ ధాన్యాన్ని ఆరబెట్టలేక అరిగోస పడుతున్నం. చేతికొచ్చిన పంట అమ్ముకునేందుకు వారం క్రితం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాం. తేమ శాతం రాకపోవడంతో ఇంకా కాంటా కాలేదు. వర్షం వస్తే టార్పాలిన్లు కప్పి.. లేకపోతే వడ్లను ఆరబెడుతున్నం. ఇలా రోజూ చేయాలంటే రెక్కలు ముక్కలవుతున్నాయ్. వర్షం బాగా వస్తే పూర్తిగా తడుస్తాయేమోనని భయంగా ఉంది. మాయిశ్చర్‌తో సంబంధం లేకుండా కాంటాలు వేస్తే రైతులకు ఇబ్బందులు తప్పుతాయి.

– భద్రమ్మ, రైతు, కొత్తపేట

## తరుగు తీయొద్దంటూ రైతుల ఆందోళన

*మిల్లర్ క్వింటాకు 5 కేజీల కోత విధిస్తున్నాడని నిరసన*

కేసముద్రం, మే 29 : ధాన్యం తూకంలో కోత విధించొద్దంటూ గురువారం మండలంలోని ఓం సాయిరాం రైస్‌మిల్లు ఎదుట రైతులు ఆందోళన చేశారు. పెద్దవంగర మండలం పోచంపల్లి కొనుగోలు కేంద్రం నుంచి ఈ నెల 24న లారీలో ఆరుగురు రైతులకు చెందిన 932 బస్తాల ధాన్యం కేసముద్రం మండల కేంద్రంలోని ఓం సాయి రైస్ మిల్లుకు దిగుమతి అయ్యింది. ఒక్కో బస్తాకు 2కేజీల చొప్పున క్వింటాకు 5 కేజీలు కోత విధిస్తున్నామని మిల్లు యాజమానులు కేంద్రం నిర్వాహకులకు తెలిపారు. వారు చెప్పడంతో గురువారం రైతులు సోమ్లా, బాలాజీ, నీలమ్మ, కొమురమ్మ మిల్లుకు చేరుకోని కోత విధించొద్దంటూ ఆందోళన చేపట్టారు. తడవని ధాన్యానికి ఎందుకు కోత విధిస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులు అక్కడికి వచ్చి వ్యాపారులతో మాట్లాడడంతో తూకంలో కోత విధించమని వారు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



రైస్‌మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

## చెరువును తలపించేలా కొనుగోలు కేంద్రం

తొర్రూరు, మే 29: మండలంలోని చర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రం చెరువును తలపిస్తున్నది. నిర్వాహకులు సకాలంలో వడ్లు కొనకపోవడంతో వర్షానికి వడ్లు తడిసి ముద్దయ్యాయి. వానకాలం పంట కోసం సన్నద్ధమవుతున్నామని, కానీ యాసంగి పంట ఇంకా కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి స్వగ్రామంలో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

## వానకు తడిసి ముద్దయిన ధాన్యం



చర్లపాలెంలో వాన నీటిలో ధాన్యం కొనుగోలు కేంద్రం

- గతేడాది భారీ వర్షాలతో తెగిన 134 చెరువులు
- వానకాలం సమీపిస్తున్నా పనుల ఊసేలేదు
- ఇప్పటికే రెండు పంటలు నష్టపోయిన రైతులు
- ఇప్పుడూ పంట కష్టమేనంటున్న అన్నదాతలు



నర్సింహులపేటలో తెగిపోయిన ముంగిమడుగు వెంకమ్మ చెరువు కట్ట

# చెరువు.. మరమ్మతు కరువు

**మానుకోట జిల్లాలో పనులకు నోచుకోని తటాకాలు**

*చెరువుల మరమ్మతుకు గ్రహణం పట్టింది. మహబూబాబాద్ జిల్లాలో గతేడాది భారీ వర్షాలతో 134 చెరువులు తెగిపోగా, అవి ఇప్పటి వరకు మరమ్మతుకు నోచుకోలేదు. వానకాలం సమీపిస్తున్నా ఆ పనుల ఊసే వినబడడం లేదు. తెగిపోయిన తటాకాలతో గతేడాది వానకాలం, యాసంగి పంట సాగు చేయలేదని, సర్కారు పనితీరుపై రైతులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఈసారి కూడా తెగిన చెరువుల కింద సాగు కష్టమేనని పెదవి విరుస్తున్నారు.*

*– మహబూబాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ)*

గతేడాది ఆగస్టు 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా 134 చెరువు కట్టలు తెగిపోగా, 8 చెక్‌డ్యాంలు సైతం వరద తాకిడికి కొట్టుకుపోయాయి. అనేక చోట్ల రోడ్లు కూడా కొట్టుకపోయాయి. చెరువు కట్టలు, వాగుల్లో ఉన్న చెక్‌డ్యాంలు తెగిపోయి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రోహిణి కార్తె ప్రారంభమైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల వర్షాలు పడుతున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం నిధులు కేటాయించి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే సరికి పుణ్యకాలం కాస్త గడిచిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1590 చెరువులు ఉండగా, వీటి ఆధారంగా లక్ష ఎకరాలకు పైగా సాగవుతున్నది. గతేడాది వానకాలంలో అతిభారీ వర్షాలతో వరద ఉధృతి పెరిగి 134 చెరువులు తెగిపోయాయి. ఇందులో 25 చెరువులకు రైతులు స్వచ్ఛందంగా గండ్లు పూడ్చుకొని మరమ్మతులు చేసుకున్నారు. మిగిలిన 109లో 10 చెరువులకు టెండర్లు పిలిచారు. మిగిలిన 99లో 44 తటాకాలకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. మరో 45 చెరువులకు నిధులు కేటాయించి టెండర్లు పిలవాల్సి ఉంది. ఈ సీజన్‌లో టెండర్లు పిలిచి పనులు పూర్తయ్యేనా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా వాగుల్లో వరదతో కొట్టుకుపోయిన చెక్‌డ్యాంలను కూడా మరమ్మతులు చేయాలని రైతులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. మహబూబాబాద్ మండలం అయోధ్య, నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి, రావిరాల చెరువులకు ఇప్పటి వరకు మరమ్మతులు చేయకపోవడంతో రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు వచ్చిన వరద బయటకు వెళ్లిపోయింది. దంతాలపల్లి మండలం దాట్ల, ఆగపేట, కుమ్మరికుంట్ల చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. కురవి మండలంలో 13 చెరువులు, చిన్నగూడూరు మండలంలో 5 చెరువుల తెగిపోగా తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. దంతాలపల్లి, నర్సింహులపేట, నెల్లికుదురు, చిన్నగూడురు మండలాల్లో 8చెక్‌డ్యాంలు తెగిపోయినా ఇప్పటి వరకు అవి మరమ్మతులకు నోచుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం వానలు పడేలోగా మరమ్మతులు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



నర్సింహులపేట మండలంలో తాత్కాలికంగా మట్టి పోసిన వెంకమ్మ చెరువు కట్ట

*మరికొద్ది రోజుల్లో విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులను ఇంటి నుంచి బడికి తీసుకెళ్లి తిరిగి గమ్యస్థానానికి చేర్చాల్సిన బాధ్యత ఆయా స్కూళ్ల యాజమాన్యాలపై ఉన్నది. అయితే ప్రతి సంవత్సరం బస్సుల నిర్వహణ సరిగా లేక ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పాఠశాలల యాజమాన్యాలు ముందుకొచ్చి తనిఖీలు చేయించుకొని వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. లేకపోతే జరిమానాతో పాటు బస్సులు సీజ్ చేస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.* *- కరీమాబాద్, మే 28*

# బడి బస్సులు భద్రమేనా?

- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి
- లేకపోతే జరిమానాతో పాటు వాహనం సీజ్
- ఇప్పటికే విద్యాసంస్థల నిర్వాహకులకు అవగాహన కల్పించాం
- జిల్లా రవాణాశాఖ ఇన్‌చార్జి అధికారి శోభన్‌బాబు




ఫిట్‌నెస్ కోసం వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చిన విద్యాసంస్థల బస్సులు

పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఆయా సంస్థల యాజమాన్యాలు తమ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకుని జిల్లా రవాణాశాఖ అధికారుల నుంచి వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఫిట్‌నెస్ లేకుండా పలు బస్సులు నడిచినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది రవాణా శాఖాధికారులు కఠినంగా వ్యవహరిస్తేనే బడి బస్సులు పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించుకునే అవకాశం ఉంది. ఉదాసీనంగా వ్యవహరిస్తే విద్యార్థుల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నది. గతేడాది వరంగల్ జిల్లాలో 320 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నాయి. ఈ ఏడాది 300 నుంచి 350 వరకు విద్యాసంస్థల బస్సులు సామర్థ్య పరీక్షలు చేయించుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో నిబంధనలను తెల్సుకోవాల్సిన అవసరం ఉంది.

- బస్సు పూర్తి కండీషన్‌లో ఉండాలి. 15 సంవత్సరాలు నిండిన వాహనాలను విద్యార్థుల రవాణాకు వినియోగించొద్దు.
- విద్యాసంస్థ పేరు, సెల్‌ఫోన్ నంబర్, పూర్తి అడ్రస్ స్పష్టంగా కనిపించేలా రాయాలి.
- డ్రైవర్‌కు 5 ఏండ్ల అనుభవం తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్ ఆరోగ్య పట్టిక నిర్వహించాలి.
- ప్రతి 3 నెలలకొకసారి డ్రైవర్‌కు ప్రాథమిక పరీక్షలు చేయించాలి.
- ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉండాలి.
- అత్యవసర ద్వారం ఉండాలి. అద్దంపై అది తప్పక రాసి ఉండాలి.
- బస్సులో మంటలు ఆర్పే పరికరాలు ఉంచుకోవాలి.
- బస్సుకు వైపర్స్, లైటింగ్ ఉండాలి. టైర్లు కండీషన్‌లో ఉండాలి.
- విద్యార్థులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు డ్రైవర్‌కు కనబడేలా అద్దాలు ఉండాలి.
- బస్సులో అటెండర్ ఉండాలి. అందులో ప్రయాణించే విద్యార్థుల పట్టిక ఉండాలి.
- విద్యార్థులు బ్యాగులు పెట్టుకునేలా ఉండాలి. కిటికీల మధ్యన కడ్డీ ఉండాలి.
- ఫుట్‌బోర్డు మెట్టు భూమికి సుమారుగా 325 మిల్లీమీటర్ల ఎత్తు ఉండాలి. మెట్లు జారకుండా చూసుకోవాలి.



బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న వరంగల్ జిల్లా రవాణాశాఖ అధికారి

### నిర్ణీత సమయంలోగా పరీక్షలు చేయించుకోవాలి



జిల్లాలోని విద్యాసంస్థల బస్సులు నిర్ణీత సమయంలోగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకు యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలి. ఇప్పటికే విద్యాసంస్థల నిర్వాహకులకు అవగాహన కల్పించాం. ఫిట్‌నెస్ చేయించుకోకపోతే జరిమానాలు విధించడంతో పాటు అవసర మైతే బస్సులను సీజ్ చేస్తాం. ఇప్పటికే వాహనాలను తీసుకువస్తున్నారు. ఫిట్‌నెస్ పరీక్షలకు రాని వారి వివరాలను సేకరించి వారికి నోటీసులు ఇస్తాం. సమయానికి ముందే వస్తే అనుకూలంగా ఉంటుంది. ఒకేసారి అన్ని వాహనాలు వస్తే ఇబ్బందులు తలెత్తుతాయి. విద్యాసంస్థల యజమానులు సహకరించి వాహనాలకు సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి. – శోభన్‌బాబు, జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి